మొదటి యూనిట్

# 1. ఆకాశంనిండా స్వాతంత్ర్యపు జెండా!

- దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి

**ఆలోచించండి - మాట్లాడండి :**



**ప్రశ్నలు :**

1. పై చిత్రంలో ఏం కనబడుతూంది? అందరూ ఏం చేస్తున్నారు?
2. జెండాకు వందనం ఎప్పుడెప్పుడు చేస్తారు? ఎందుకు చేస్తారు?
3. మన జెండాలో ఎన్ని రంగులు ఉన్నాయి? అవి ఏవి?

**నేపథ్యం :**

కొన్ని వందలఏండ్లు విదేశీయుల పాలనలో బాధలు పడిన భారతదేశానికి 1947 సం॥లో స్వాతంత్ర్యం లభించింది. దేశంలో అందరూ స్వేచ్ఛావాయువులను పీల్చుకొన్నారు. ఆ ఆనంద క్షణాలలో కవులు, రచయితలు పుంఖానుపుంఖాలుగా గేయాలు, కథలు, కావ్యాలు రచించారు.

దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రిగారు ఆ సందర్భంలో ఈ గేయం రచించారు. మన జెండా ఎందరో వీరులు తమనెత్తురు ధారపోసి సంపాదించిన స్వాతంత్ర్యానికి గుర్తు అనీ అంతటా పేదరికం తొలగిపోవాలనీ మొండిపట్టుతో దౌర్జన్యంచేసి మాట నెగ్గించుకొనేవాళ్ళకు అధికారం రాగూడదనీ అందరికీ సమానావకాశాలుండే విధంగా కొత్త పాలన జరగాలనీ కవి ఆశించాడు.

ప్రస్తుత పాఠ్యభాగం "కృష్ణశాస్త్రి గేయసంపుటి" లోనిది.

**విద్యార్థులకు సూచనలు :**

1. పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద, వాక్యాల కింద గీతలు గీయండి.
2. అర్థంకాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.
3. తెలియని పదాల అర్థాలను పుస్తకం చివరన ఉన్న అకారాది పట్టిక చూసి తెలుసుకోండి.



ఎత్తండీ ! ఎత్తరేం ? స్వాతంత్ర్యపు జెండా !
ఎత్తవోయ్ ! ఎత్తు, ఎత్తు ఆకాశంనిండా !

కే లూపుచు, తల ఊపుచు గాలిదారు లంట
మన జెండా, మనదే, వీరుల నెత్తురు పంట !
కొత్తవేడి, కొత్తవాడి భరతావని నిండ
ఎత్తవేం ? ఎత్తు, ఎత్తు, ఆకాశంనిండా !
॥ ఎత్తండీ, ఎత్తరేం ? స్వాతంత్ర్యపు జెండా! ॥

అర్థమత్తు లహంకృతులు, అంధమతులు రాని
నిరుపేదలు, నిర్భాగ్యులు, నిరంకుశులు లేని
కొత్త జగం, కొత్త యుగం భరతావని నిండ
ఎత్తమంటె ! ఎత్తు, ఎత్తు ఆకాశంనిండా !
॥ ఎత్తరేం ? ఎత్తండీ, స్వాతంత్ర్యపు జెండా! ॥

కులం దాటి, మతం దాటి, కొద్ది గొప్ప దాటి
సమభోగం, సమభాగ్యం సమసంస్కృతి నాటి
కొత్త శాంతి, కొత్త కాంతి భరతావని నిండ
ఎత్తండోయ్ ! ఎత్తు, ఎత్తు ఆకాశంనిండా !
॥ ఎత్తండీ, ఎత్తరేం ? స్వాతంత్ర్యపు జెండా! ॥

© SCERT not to be republished



## కవి పరిచయం

**పేరు** : దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి

**కాలం** : 1897-1980

**జన్మస్థలం** : తూర్పు గోదావరి జిల్లాలోని పిఠాపురం దగ్గరి చంద్రంపాలెం.

**రచనలు** : కృష్ణపక్షం, ఊర్వశి, సాహిత్య వ్యాసాలు, సినీగేయాలు

**బిరుదు** : కళాప్రపూర్ణ, పద్మభూషణ్

## సారాంశం:


మన స్వాతంత్ర్యానికి గుర్తు అయిన ఈ జెండాను ఎగరేయండి. ఆకాశమంతటా ఇది రెపరెపలాడాలి. వినువీథులంటేటట్లుగా ఎగరెయ్యాలి. ఇది మనందరి జెండా. ఎందరో వీరులు ప్రాణాలను లెక్కచేయకుండా పోరాడి సాధించిన స్వాతంత్ర్యానికి ఇది గుర్తు. దీన్ని చూసినప్పుడు మన దేశీయులకు కొత్త ఉద్వేగం, కొత్త ఉత్సాహం పుడుతుంది. అది దేశమంతటా వ్యాపిస్తుంది.

బాగా డబ్బున్నందువల్ల కళ్ళు మూసుకుపోయినవాళ్ళు, పొగరెక్కినవాళ్ళు, తెలివిలేనివాళ్ళు అధికారం పొందగూడదు. చాలా బీదవాళ్ళు, దురదృష్టవంతులు, నియంతలు లేని కొత్త ప్రపంచం, కొత్త కాలం రావాలి. ఇది భారతదేశమంతటా కనిపించాలి.

కులమతాల అడ్డుగోడలు లేని; పేద, ధనిక భేదాలు కనిపించని; శాంతిని, సంపదను సమానంగా పంచే భోగభాగ్యాలతో సర్వసమానత్వం ఏర్పడే, సమాన సంస్కృతి శోభిల్లే నవీనకాంతి భారతదేశం నిండా ప్రసరించేవిధంగా మన స్వాతంత్ర్యపు జెండాను ఎగరెయ్యాలి. ఆకాశంనిండా వ్యాపించేలా ఎగరేయండి.




### I. వినడం-మాట్లాడడం



1. ఈ గేయం దేన్ని గురించి చెబుతున్నది ?
2. ఆకాశంనిండా, స్వాతంత్ర్యపు జెండా! అనే శీర్షికనుబట్టి నీవేమని భావిస్తున్నావు?
3. "జెండా" ను ఎప్పుడెప్పుడు ఎగరవేస్తారు? ఎగరవేసినప్పుడు ఏం చేస్తారు?
4. "జెండా" గొప్పతనం ఏమిటి?
5. జెండా ఎగరవేసినప్పుడు నువ్వు పొందిన అనుభూతులు ఏమిటి?

### II. చదవడం - రాయడం



1) గేయంలో ఎన్ని పంక్తులు ఉన్నాయి? ప్రతి పంక్తిలో ఉన్న చివరిపదం ఏది? రాయండి?

2) కింది వాక్యాలను చదవండి. వీటికి సంబంధించిన పంక్తులు గేయంలో ఎక్కడ ఉన్నాయి? వాటి కింద గీత గీయండి.

స్వాతంత్ర్యపు జెండా ఎత్తండి. ఆకాశమంతటా వ్యాపించేలాగ మన జెండా ఎత్తండి.

©SCERT Not to be republished

3) గేయంలో ద్విత్వాక్షర పదాలు, సంయుక్తాక్షర పదాలు ఏమున్నాయో రాయండి.

4) పాఠం ఆధారంగా జవాబులు రాయండి.

అ) కవి చెప్పిన కొత్త ప్రపంచం ఎలాంటిది?

ఆ) 'కులం దాటి, కొత్త కాంతి భరతావని నిండా' అనే వాక్యాలకు భావం ఏమిటి?

ఇ) కవి జెండాను ఎలా ఎగరవేయమని కోరారు?

## III. స్వీయరచన



### 1. లఘు సమాధాన ప్రశ్నలు

అ) మన జెండా వీరుల నెత్తురుపంట అనడంలో కవి ఉద్దేశమేమిటి?

ఆ) "అహంకారులు, అజ్ఞానులు, ధనదాహం కలవారు లేని దేశం కావాలని" కవి కోరుకున్నాడు కదా! ఇలా ఎందుకు కోరుకొని ఉంటాడు?

ఇ) అహంకారంవల్ల కలిగే అనర్థాలేమిటో రాయండి.

ఈ) ఈ గేయానికి మీరొక పేరు పెట్టండి. ఇలా పేరు పెట్టడానికి కారణాలు రాయండి.

ఉ) "కొత్త శాంతి" "కొత్త కాంతి" తో భరతావని నిండాలని కవి ఎందుకు కోరుకున్నాడు?


### 2. వ్యాసరూప ప్రశ్నలు :

అ) పాఠం సారాంశాన్ని సొంతమాటల్లో రాయండి.

ఆ) మీరు పాల్గొన్న పతాకావిష్కరణ కార్యక్రమాన్ని గురించి రెండు పేరాలు రాయండి.

ఇ) ఈ గేయంలో నాటకీయతకోసం కవి ఏ ఏ మాటలను ఏ ఏ అర్థాల్లో వాడారో తెలపండి.

## IV. పదజాలం



1. "జెండా" కు సంబంధించిన పదాలు రాయండి.

2. గేయం చివరి చరణంలో వచ్చిన 'కులం, మతం' అనే రెండు చిన్న పదాలతో 'కులమతాలు' అనే పెద్దమాట ఏర్పడుతుంది. ఇలా వచ్చే మరొక పెద్దమాటను రాయండి.

3. కింది పదాలు, ఒకే వాక్యంలో వచ్చేటట్లు రాయండి.

ధనికులు – పేదలు; కొద్ది – గొప్ప; శాంతి – కాంతి; వాడి – వేడి.

4. పాఠంలో కింది గుణింతాలతో కూడిన అక్షరాలు ఉన్న పదాలు ఉన్నాయా? ఒక్కొక్క దానికి వేరు వేరు పదాలు రాయండి.

| ా | ి | ీ | ు | ూ | ె | ే | ై | ొ | ో | ౌ |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | | | | | |

©SCERT not to be republished

## V. సృజనాత్మకత



1. మన జాతీయ జెండా చిత్రాన్ని గీయండి. రంగులు వేయండి. జెండాలోని ఒక్కొక్క రంగు ప్రత్యేకతను వర్ణించండి.
2. " ఆకాశం నిండా స్వాతంత్ర్యపు జెండా" గేయాన్ని అందరు కలసి అభినయంతో పాడండి.
3. గేయంలో కొత్త వేడి, కొత్త వాడి, కొత్త జగం, కొత్త యుగం, కొత్త శాంతి, కొత్త కాంతి వంటి పదాలు ఉన్నాయి. ఇలాగే మరికొన్ని పదాలు రాయండి. వాటితో కొత్త గేయాన్ని రాయండి.

## VI. ప్రశంస



1. గేయంలో మీకు నచ్చిన పదాలను, పంక్తులను గురించి రాయండి. అవి మీకు ఎందుకు నచ్చాయో తెలపండి.
2. గేయాన్ని మీ తరగతిలో ఎవరు బాగా పాడారు? ఎవరు బాగా అభినయం చేశారు? బాగా ఉందని మీరు ఎందుకు అనుకుంటున్నారో చెప్పండి.

## VII. ప్రాజెక్టు పని



1. వార్తాపత్రికలు చూడండి. వాటిలో వచ్చే దేశనాయకుల చిత్రాలను , దేశభక్తి గేయాలను సేకరించండి. వాటిని చార్టుమీద రాసి ప్రదర్శించండి.

## VIII. భాషను గురించి తెలుసుకుందాం



**ధ్వని అనే మాటకు చప్పుడు, శబ్దం అని అర్థం. భాషా విషయంలో మాత్రం ధ్వని అంటే నోటితో పలికేది అని అర్థం.**

**భాషాధ్వనులకు సంబంధించిన అక్షరపు గుర్తుల పట్టికను 'వర్ణమాల' అంటారు. 'అక్షరమాల' అని కూడా అంటారు.**

ఉదా॥ 'అ' – అనేది ఒక ధ్వనిని తెలిపే గుర్తు. అంటే అక్షరం.

'మ' – అనే దాంట్లో రెండు ధ్వనులున్నాయి. 'మ్ + అ' = 'మ' అవుతుంది.

'అ, ఆ, ఇ, ఈ' వంటి వర్ణాలను "అచ్చులు" అంటారు.

క, ఖ, గ, ఘ వంటి వర్ణాలు "హల్లులు".

అక్షరమాలలో ఎలా ఉన్నా హల్లు అనేది పొల్లుగా పలికే ధ్వని.

'మ్', 'అ' అనే ధ్వనులు కలిసి 'మ' అయింది. మొదటిది హల్లు. రెండోది అచ్చు.

కొన్ని అక్షరాల్లో రెండేసిగాని, మూడేసిగాని హల్లులు కలిసి ఉండవచ్చు.

ఇవి రెండు రకాలు:– ద్విత్వాక్షరం, సంయుక్తాక్షరం.

**ద్విత్వాక్షరం:** ఒక హల్లుకు అదే హల్లు తాలూకు ఒత్తుచేరితే దాన్ని "ద్విత్వాక్షరం" అంటారు.

ఉదా॥ 'క్క' = క్ + ్క(క్) + అ = క్క – ఇందులో కకారం రెండు సార్లు వచ్చింది.

**సంయుక్తాక్షరం :** ఒక హల్లుకు వేరొక హల్లు తాలూకు ఒత్తుచేరితే దాన్ని "సంయుక్తాక్షరం" అంటారు.

© SCERT not to be republished

ఉదా॥ 'న్య' = న్ + య్ + అ – ఇందులో నకార, యకారాలనే రెండు హల్లులు వచ్చాయి.

క్ష్మి = క్ + ష్ + మ్ + ఇ – ఇందులో కకార, షకార, మకారాలనే హల్లులు మూడు కలిశాయి.

**1. కింది అక్షరాల్లో రెండేసి వర్ణాలున్నాయి. వాటిని గుర్తించండి.**

ఉదా॥ గా = గ్ + ఆ = (రెండు ధ్వనులు)

(అ) య : ........ + ........

(ఆ) కా : ........ + ........

**2. కింది పదాల్లోని సంయుక్త, ద్విత్వాక్షరాల్లోని ధ్వనులు రాయండి.**

ఉదా॥ పద్మ = ద్ + మ్ + అ = ద్మ (మూడు ధ్వనులు)

(అ) ఎత్తండి : ....... + ....... + ....... = .......

(ఆ) భాగ్య : ....... + ....... + ....... = .......

(ఇ) సంస్కృతి : ....... + ....... + ....... = .......

**వర్గాక్షరాలు:** 'క' నుండి 'మ' వరకు ఉన్న అక్షరాలను ఐదు వర్గాలుగా విభజించారు. అవి

క – వర్గం : క – ఖ – గ – ఘ – ఙ

చ – వర్గం : చ – ఛ – జ – ఝ – ఞ

ట – వర్గం : ట – ఠ – డ – ఢ – ణ

త – వర్గం : త – థ – ద – ధ – న

ప – వర్గం : ప – ఫ – బ – భ – మ

**3. కింది వాక్యాలలో ఒక వర్గపు అక్షరాలు దాగి ఉన్నాయి. వాటిని గీత గీసి గుర్తించండి.**

**"బలరాం మంచి ఫలాలకోసం పల్లెలో తోటకు వెళ్ళాడు. తోటలో పామును చూసి భయపడ్డాడు"**



**నేనివి చేయగలనా ?**

| | | |
|---|---|---|
| 1. | గేయాన్ని రాగంతో, అభినయంతో పాడగలను. | ఔను / కాదు |
| 2. | పాఠం సారాంశాన్ని సొంతమాటల్లో స్పష్టంగా చెప్పగలను. | ఔను / కాదు |
| 3. | గేయం సారాంశాన్ని సొంతమాటల్లో రాయగలను. | ఔను / కాదు |
| 4. | ఇందులోని పదాలను సొంతవాక్యాలలో ప్రయోగించగలను. | ఔను / కాదు |
| 5. | పాఠంలోని పదాలతో కొత్త గేయం రాయగలను. | ఔను / కాదు |

'ప్రపంచాన్ని రక్షించే జ్ఞానాన్ని భారత దేశం సంరక్షిస్తోంది' - శ్రీ అరవిందులు.

© SCERT not to be republished